# 7

# "పరలోక రాజ్యము సమీపించియున్నది"

*"అప్పటినుండి యేసు – పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలు పెట్టెను" (మత్తయి 4:17).*

కొన్ని సార్లు నన్ను అంతకుముందు ఎన్నడూ వెళ్లని స్థలాలకు సువార్త కూడికలకుగాను పిలుస్తారు. అట్టి సందర్భాల్లో, ఏ సహోదరులతో పని చేయవలసి వస్తుందో, వారు దాదాపు వ్యక్తిగతంగా నేను ఎరుగనివాళ్ళయి ఉంటారు. గనుక నేను క్రొత్త అనుభవాలను, నూతన బాంధవ్యాలను పొందవలసి వస్తుంది. నేను ఫోనులో మాట్లాడినప్పుడు, లేదా వారి ఉత్తరాలను నేను చదివినప్పుడు, నా మనస్సులో వారిని గూర్చి ఒక రూప చిత్రం ఏర్పడుతుంది. ఆ కార్యక్రమం సమీపించి, నేను ఆ మీటింగు స్థలానికి చేరుకున్న తరువాత, నేను ఎదురు చూచిన దానికిని ఎదుర్కొన్న దానికిని పోల్చి చూడడం ఎంతో ఆసక్తిగా ఉంటుంది. ఒక సహోదరుడు ముందుకు వచ్చి నాతో కరచాలనం చేసినప్పుడు, "ఓహో నాతో ఫోనులో మాట్లాడింది యితడేనేమో అని నేను అనుకుంటాను." (అంతా క్రొత్తే గదా) లేదా నేను ప్రసంగించవలసిన సమయం కొరకు వేచియుండగా, చుట్టూ కలయ చూసి, "నేను తెలిసికొనడానికి కుతూహలపడిన స్థానిక సంఘం యిదే కాబోలు" అని తలంచుతాను.

లేఖనాల్లో సంఘాన్ని గూర్చి కూడా యిలాటి సంగతులే జరిగాయి. దేవుని రాజ్యము జీవితంలో అనుభవంగా చిత్రింపబడక మునుపు ప్రవచనంలో ఎదురు చూచింది. ముందుగా, పాత, క్రొత్త నిబంధనల ప్రవచన అంశంగానూ, తరువాత అది అపొస్తలుల కార్య గ్రంథంలో సజీవమును, శక్తివంతమునగు ఆత్మ సంబంధమైన శరీరంగానూ ఉంటుంది.

ఈ విధంగా లోకంలోకి వచ్చిన సంఘం అపార్థం చేసుకున్న మీదటి తలంపు కాక, గతించిన నిత్యత్వంలోనే దేవుడు ముందుగా ఏర్పరచుకొన్న సంకల్పానికి

నెరవేర్పుగా వచ్చింది.

బైబిలంతటిలో మూడు రకాలైన ప్రవచనం విస్తరించి ఉంది: నామ ప్రవచనం, ద్వంద్వ ప్రవచనం, మరియు మాదిరియగు ప్రవచనం – అనేవి.

నామ ప్రవచనం, లేక వివరించి చెప్పిన ప్రవచనం. ముందుగా చెప్పబడిన సంఘటనలకు సంబంధించి ప్రత్యేకమైన వ్యక్తి లేక స్థలం ఏరుకోబడుతుంది. ఉదాహరణకు, దేవుని ధర్మశాస్త్రానికి అవిధేయతగా బేతేలులోని బలిపీఠం మీద రాజైన యరోబాము ధూపము వేయుచుండగా పేరు చెప్పబడని ప్రవక్త ఆ బలిపీఠంతో మాట్లాడాడు. పరోక్షంగా అతడు యరోబామును గద్దిస్తూ, యోషీయా అనే ఒకడు యరోబాము బలిపీఠాన్ని ఒకనాడు పాడు చేస్తాడనిన్నీ, నర శల్యాలను దానిమీద అర్పిస్తాడనిన్నీ ఆ ప్రవక్త చెప్పాడు. ఆ ప్రవచనం రమారమి 300 సంవత్సరాల తరువాత నెరవేర్చబడింది. దక్షిణ దేశానికి చెందిన మంచి రాజులలో ఒకడైన యోషీయా యొక్క దిద్దుబాటు కాలంలో అది సంభవించింది (2 రాజులు 23:20).

నామ ప్రవచనానికి మరో ఉదాహరణ, యెషయా 44:28లోని పారశీక దేశపు రాజైన కోరెషుకు సంబంధించినది. తాను జీవించడానికి రమారమి 150 సంవత్సరాలకు పూర్వమే నామంతో యెషయాచే అతడు ప్రవచింపబడ్డాడు. బబులోను చెరానంతరం యూదులు తమ స్వదేశం వెళ్లి యెరూషలేమును తిరిగి కట్టుకునేలా అతడు అనుమతిస్తాడని యెషయా ప్రవచించాడు (యెషయా 44:28; ఎజ్రా 1:1–3తో పోల్చి చూడు). నామ ప్రవచనాలు సాధారణంగా స్పష్టంగా ఉంటాయి గనుక సులభంగా గుర్తించబడతాయి.

రెండవ రకమైన ప్రవచనం – ద్వంద్వ ప్రవచనం. ఇందులో పలుకబడిననాటికి ఆ ప్రవచనం యొక్క వర్తింపు ఉంటుంది. రెండవ వర్తింపు భవిష్యత్తులో మరోనాటికి ఉంటుంది. అంటే, ఆ ప్రవచనానికి రెండు అర్థాలుంటాయి: ఒకటి ప్రస్తుతానికి సంబంధించినది, రెండవది భవిష్యత్తుకు సంబంధించినది. ఖ్యాతిగాంచిన యెషయా 7:14 యేసు కన్య గర్భమందు జన్మిస్తాడనే ప్రవచనం ద్వంద్వ ప్రవచనమై ఉంది. తన శత్రువులైన రెజీను పెకహులు కొద్ది కాలంలోనే రంగ నిష్క్రమణ చేస్తారనే వర్తమానం ఆహాజును ప్రోత్సహించడానికి ఉద్దేశింపబడింది. అంతేగాక అద్భుతరీతిగా ప్రభువైన యేసు కన్య గర్భమందు జన్మిస్తాడనియు ప్రవచింపబడింది. కన్యకు జన్మించే వృత్తాంతాన్ని వర్ణించుతూ మత్తయి దానికి దైవ ప్రేరేపితమైన వ్యాఖ్యానం చేశాడు (మత్తయి 1:23).

మూడవ రకమైన ప్రవచనము మాదిరియగు ప్రవచనం. ఏదో ఒక విధంగా భవిష్యత్ సంభవాన్నో లేక పరిస్థితినో ఈ ప్రవచనం ముందుగా రూపకల్పన చేస్తుంది. ఉదాహరణకు, యోసేపు మరియను బాలుడగు యేసును వెంటబెట్టుకొని ఐగుప్తుకు హేరోదు యొక్క ఆగ్రహాన్ని తప్పించుకొనడానికి వెళ్లి, అతని మరణంవరకు అక్కడ ఉన్నాడు. ఐగుప్తునుండి నజరేతుకు వారి రాక మాదిరియగు ప్రవచనాన్ని నెరవేర్చింది. ప్రవచనం యొక్క ఈ భాగం విషయంలో మనం నిశ్చయంగా ఉండగలం. ఎందుకంటే ఐగుప్తునుండి వారు తిరిగి వచ్చుటను గూర్చి మత్తయి తెలియజేశాడు: " 'ఐగుప్తులోనుండి నా కుమారుని పిలిచితిని' అని ప్రవక్తద్వారా ప్రభువు సెలవిచ్చిన మాట నెరవేర్చబడునట్లు

హేరోదు మరణమువరకు అక్కడనుండెను" (మత్తయి 2:15). మత్తయి సూచించిన పాత నిబంధన లేఖన భాగం హోషేయ 11:1, దేవుడైన యెహోవా తన ప్రజలను ఐగుప్తు దాస్యంనుండి రప్పించిన దానికి యిది పోలికగా ఉంది. అంటే, ఇశ్రాయేలీయులు ఐగుప్తు దాస్యంనుండి రావడం ఉపమానం, ప్రభువైన యేసు ఐగుప్తులోనుండి పిలువబడడమనేది ఉపమేయం అని చెప్పవచ్చు. మాదిరి ప్రవచనాలు అస్పష్టమైనవి. అందువలన, చాలామట్టుకు దైవ ప్రేరేపితనమైన వ్యాఖ్యానం మీదనే వాటి గుర్తింపు కొరకును వివరణ కొరకును ఆధారపడవలసి ఉంటుంది.

అందులో ప్రత్యేకించి, రాజ్యము లేక సంఘమును గూర్చి ప్రభువైన యేసు చేసిన ప్రవచనాలను గూర్చి ఆలోచింతము. వాటిలో ఎక్కువ ఖచ్చితంగా చేయబడ్డవే. ప్రభువైన యేసు మనకు రాజును ప్రధాన యాజకుడునై యున్నాడు. అంతేకాదు, ఆయన దేవుని ప్రవక్తయై ఉన్నాడు. మోషే యిలా అన్నాడు, "నీ దేవుడైన యెహోవా నీ మధ్యను నా వంటి ప్రవక్తను నీ సహోదరులలో నీకొరకు పుట్టించును" (ద్వితీయో. 18:16). ఈ ప్రవచనం ప్రభువైన యేసుకు చెందినట్టు అపొ. 3:18-23లో పేతురు వ్యాఖ్యానించాడు. ఆయనను గూర్చి హెబ్రీ పత్రిక యొక్క రచయిత కూడా యిలా వ్రాశాడు: "పూర్వ కాలమందు నానాసమయములలోను నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను ..." (హెబ్రీ. 1:1, 2).

దేవుని ప్రవక్తగా, సంఘమును గూర్చి లేక రానున్న రాజ్యమును గూర్చి ప్రభువైన యేసు అనేకమైన ప్రవచనాలను పలికాడు. పాత నిబంధన కాలపు ప్రవచనాలవలెనే, ఆయన ప్రత్యక్షతలు సహా నెరవేర్చబడ్డాయి. చరిత్ర యొక్క, క్రొత్త నిబంధన యొక్క ఏ విద్యార్థియైనా దీన్ని గమనించగలడు. సంఘమును గూర్చి యేసు చెప్పిన ప్రవచనాలను ఆలోచిస్తుంటే, రాజ్యముయొక్క కాలము, స్వభావము, ఆరంభము అనేవాటిని తీర్మానించడంలో ప్రత్యేకంగా అది బోధింపబడి ఉన్నట్టు తెలుస్తుంది.

## త్వరలో వస్తుంది

రాజ్యం త్వరలో వస్తుందని ప్రభువు ప్రవచించాడు. అది దగ్గరగా ఉంది, "సమీపంగా ఉంది." అది "చేతిలోనో" లేక వర్తమాన కాలంలోనో లేదు, అయితే అది "సమీపంగా ఉంది" లేక దగ్గరకు వస్తుంది. అది స్థాపింపబడే కాలం, మనం మామూలుగా మాట్లాడే భాషలో, అది "దూరంగా లేదు" లేక "యిక్కడే దగ్గరగా ఉంది."

రాజ్యం "సమీపంగా ఉంది" గనుక మారుమనస్సు పొందుడని ప్రజలకు బోధించుతూ, బాప్తిస్మమిచ్చు యోహాను ప్రభువైన యేసుకు మార్గాన్ని సిద్ధపరచాడు. ఆ యోహానును గూర్చి మత్తయి యిలా అన్నాడు: "ఆ దినములయందు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి - పరలోకరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొందుడని యూదయ అరణ్యములో ప్రకటించుచుండెను" (మత్తయి 3:1, 2).

ఆయన బాప్తిస్మము, శోధనల అనంతరం, ప్రభువైన యేసు ఆయన భూ పరిచర్యను

ఆరంభించి, యోహాను ప్రకటించిన వర్తమానాన్నే ప్రకటించాడు; రాజ్యము సమీపమై ఉన్నట్టు ఆయన సూచించాడు. ఆయనను గూర్చి మత్తయి యిలా వ్రాశాడు: "అప్పటినుండి యేసు – పరలోకరాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలు పెట్టెను" (మత్తయి 4:17). యేసు తన పండ్రెండు మంది అపొస్తలులను పరిమితి ఉత్తరువుతో పంపుతూ వారికి యిలా ఆదేశించాడు: "వెళ్లుచు – పరలోకరాజ్యము సమీపించియున్నదని ప్రకటించుడి" (మత్తయి 10:7).

---

**రాజ్యము కాలాంతమున వచ్చేదిగా ప్రభువు బోధించలేదనే ముఖ్య పాఠాన్ని అది మనకు నేర్పుతుంది. అంతేగాక, తన పరిచర్య ముగింపబడిన తరువాత అతి తొందరలోనే అది స్థాపింపబడుతుందని తెలుపుతుంది.**

---

"ప్రభువైన యేసుయొక్క పరిచర్య కాలంలోనే పరలోక రాజ్యమున్నట్టు ఆయన సూచింపలేదా? 'సమీపంగా ఉన్నదనే' ఆయన ప్రవచనాన్ని ఈ లేఖన భాగాలు ఖండించవా?" అని ఎవరైనా ప్రశ్నింపవచ్చు. అలా ప్రశ్నించడం మంచిది. మత్తయి 11:12, మత్తయి 12:28 అనే రెండు లేఖన భాగాలను (ఆయన ప్రతిపాదనలను) ఈ విధంగా వ్యాఖ్యానించవచ్చు. "బాప్తిస్మమిచ్చు యోహాను దినములు మొదలుకొని యిప్పటివరకు పరలోకరాజ్యము బలాత్కారముగా పట్టబడుచున్నది, బలాత్కారులు దాని నాక్రమించుకొనుచున్నారు" (మత్తయి 11:12). "దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది" (మత్తయి 12:28).

11:12ను మరి సూక్ష్మంగా పఠించినట్లయితే, దేవుని యొక్క కాల పరిమాణం ప్రకారం కాక, తమ కాల పరిమాణం ప్రకారం, "వెంటనే అది వచ్చేలా చేయుమని" దేవుని రాజ్యాన్ని గూర్చిన ఆయన బోధ వినేవారు కోరుతున్నట్టు కన్పిస్తుంది. దేవుని రాజ్యం అప్పటికే వచ్చిందని ప్రభువైన యేసు చెప్పడంలేదు, అయితే తప్పుగా నడిపింపబడిన ప్రజలు ఏమి చేస్తున్నారంటే – దేవుడు దాన్ని తేవాలని కోరుకున్న దానికంటే ముందుగా అది రావాలని తొందర పెడుతున్నారు. ప్యూపా దశలో ఉన్న సీతాకోక చిలుక దాని సమయానికి ముందుగానే బయటకి రావాలని చిన్న పిల్లలు దాని చుట్టూ ఉన్న గూడును పగులగొట్టినట్టుగా వారు కోరారు.

12:28లో తాను దయ్యాన్ని వెళ్లగొట్టిన విషయాన్ని సూచిస్తూ ప్రభువైన యేసు మాట్లాడుతున్నాడు. ఎందుకంటే, బయెల్జెబూల శక్తివలన ఆయన ఆ అద్భుతం చేసినట్టు తనపై నేరం మోపినవారికి ప్రత్యుత్తరం యిస్తున్నాడు. అలా, ఆయన దైవమునని రుజువు చేసికొంటున్నాడు. ప్రభువైన యేసు వారి మధ్య ఉండడమే లోకంలో దేవుని రాజ్యారంభం కావడంగా భావించబడింది. రాజ్యం యింకా రాలేదు. అయితే రానున్న రాజ్యానికి రాజుగా దేవుని కుమారుడు వారి మధ్యనున్నందున, రాజ్యముయొక్క రాక ఆ క్రమాన్ని

అనుసరించి ఉంది.

బైబిలు వ్యాఖ్యానంలోని ముఖ్యమైన సూత్రమేమిటంటే, స్పష్టంగా లేని లేఖన భాగాలను తికమకలేకుండా వివరించడం. "సమీపమున" అని మన ప్రభువు బోధించిన దానికి, రాజ్యము వస్తున్న సమయాన్ని గూర్చిన ప్రత్యేకమైన సూచన యివ్వడమే. కాల క్రమాన్ని గూర్చి రెండు సత్యాలను ప్రభువు గట్టిగా స్థిరపరచాడు. మొదటిది, వారు ప్రసంగించుచున్న సమయంలో **రాజ్యం** రాలేదు, అది ఇంకా భవిష్యత్తులోనే రాబోతుంది; రెండవది, రాజ్యం **త్వరలో** రానుంది. కాని అతి త్వరలో రానుంది. ఈ సత్యాలు ప్రాముఖ్యతలేని వివరాలు కాదు; యోచింప అయోగ్యమైనవి కావు. రాజ్యము కాలాంతమున వచ్చేదిగా ప్రభువు బోధించలేదనే ముఖ్య పాఠాన్ని అది మనకు నేర్పుతుంది. అంతేగాక, తన పరిచర్య ముగింపబడిన తరువాత అతి తొందరలోనే అది స్థాపింప బడుతుందని తెలుపుతుంది. ఈ పదాన్ని ఆనందంతో స్వీకరిస్తే రాజ్యము ఇప్పుడు ఇక్కడే ఉంది. భవిష్యత్తులో నిరీక్షణ మనకు అవసరం లేదు అని సూచిస్తుంది.

మన పిల్లలు యింకా బాల్యంలో, ఆట వస్తువో లేక వారికి కావలసిన మరి ఏదో కొనిపెట్టమని అడిగితే, వారిని అప్పుడప్పుడు షాపుకు తీసికొనిపోతాం. జన్మ దినానికి గాని మరియొక సందర్భానికి గాని ఒక గిఫ్ట్ కొనడానికి వారు డబ్బు తీసుకుని ఉండవచ్చు. "కొద్ది సేపటిలో షాపుకు వెళ్లి నీకు కావలసినది తెచ్చుకుందాం" అని మనం ఒక వాగ్దానం చేస్తాం. వెళ్లాలని ఆత్రుతతో పిల్లలకు సమయం ఎప్పటికీ గడవదని బాధపడుతూ ఉంటారు. "మనం వెళ్లే సమయం అయ్యిందా? మనం యిప్పుడు వెళ్లుతున్నామా?" అని ప్రతి ఒకటీ రెండు నిమిషాలకు వారడుగుతూ ఉంటారు. "అంతలోనే కాదు కొద్ది నిమిషాలలో మనం వెళ్లతాం. మనం వెళ్లబోయే సమయం అవుతోంది" అని మనం అంటాం. "సమయం అవుతోంది" అనే పద ప్రయోగాన్ని అర్థం చేసికొనడానికి వారికి కష్టంగా ఉంటుంది. వారు ఆగలేరు. వారికి ఎల్లప్పుడు యిప్పుడనేటట్టుగానే జీవితాన్ని జీవిస్తారు. "–మనం ఎప్పుడు వెళ్లతామనే సంగతిని యిక ఎత్తవద్దు, మనం వెళ్లే సమయమెప్పుడో నేను చెప్పతాను" అని మనం అంటాం.

అలాగే, "సమీపమైయున్నది," "సమీపించియున్నది" అని రాజ్యము స్థాపింపబడనై యున్న భవిష్యత్ సమయాన్ని బాప్తిస్మమిచ్చు యోహానును, ప్రభువైన యేసును సూచించడంలో, రాజ్యము లేని సమయం కూడా సూచించబడింది. వారి మాటలనాధారం చేసికొని, పరలోకరాజ్యము సమీపించియున్నదని యోహానును యేసువారును ప్రకటించిన దినాల్లో రాజ్యము యొక్క ఉనికి మనం చూడకూడదు. అయితే ప్రభువైన క్రీస్తు యొక్క పరిచర్య అనంతరం లేక దాని తదుపరి త్వరలోనే రాజ్యము ఉన్నట్టు న్యాయ సమ్మతంగా మనం ఎదురు చూడవచ్చు.

## బలముతో వస్తుంది

దైవికమైన బలముతో రాజ్యం వస్తుందని కూడా ప్రభువు ప్రకటించాడు. మార్కు 9:1 యిలా అంటుంది: "మరియు ఆయన – ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు

దేవునిరాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను."

ఆయన మాట్లాడుతూ ఉండగా వింటున్న కొందరి జీవిత కాలంలోనే దేవుని రాజ్యము శక్తితో వస్తుందని ప్రభువు బయలుపరచాడు. మన ప్రభువు యొక్క ప్రవచనంనుండి మూడు ప్రత్యేకమైన నిర్ణయాలు చేయవచ్చు: (1) ఆయన మాటలు వింటున్నవారి జీవిత కాలంలోనే వస్తుంది. (2) అయితే రాజ్యం వచ్చేవరకు ఆయన శ్రోతలలో ప్రతి ఒక్కడు బ్రతికియుండడు. (3) రాజ్యం వచ్చిందనడానికి ఉన్న గురుతులలో ఒకటేమంటే – దాని వెంటవచ్చు దైవికమైన శక్తి.

ఉదాహరణకు, ఒకడు ఒక పనిమీద మరియొకని పంపినప్పుడు అవి ఉపయోగపడతాయి. తనకు కావలసిన ప్రత్యేకమైన రొట్టె పేరును చెప్పకుండ సామానుల దుకాణం దగ్గరకు పంపడం గూర్చి అంత మంచిది కాదని నా భార్యకు తెలుసు. దుకాణంలో వస్తువులు కొనేటప్పుడు సహితం – నా మనస్సులో నేను ప్రసంగం తయారు చేసికొనే ప్రయత్నంలో ఉంటానని ఎరిగి, ఆ రొట్టె పేరేమో తెలపడం మాత్రమే గాక దానిలో ఏ రకం కావాలో కూడా ఆమె నాకు తెలుపుతుంది. "కొలోనియల్ గోధుమ రొట్టె" కొనమని ఆమె నాకు చెప్పవచ్చు. దాని ప్రత్యేకతలను చెప్పకుంటే నేను మరొక రొట్టెను తెస్తానని ఆమెకు తెలుసు.

సువార్త రచనలలోనే రాజ్య స్థాపనను గుర్తింపజేసే చిహ్నాలు కన్పించనారంభించాయి. యోహానుయొక్కయు ప్రభువైన యేసుయొక్కయు సువార్త ప్రకటనలో రాజ్యము "సమీపమైయున్న" సంగతి మనకు తెలుసు. ప్రభువు భూ నివాస కాలపు పరిచర్య ముగించిన వెనువెంటనే దాని రాకను మనం కనుగొనాలి. మార్కు 9:1లో ప్రభువు మాటలు వింటున్న వారి జీవిత కాలంలో ప్రభావవంతంగా రావాలని మనకు తెలుసు. అది త్వరలోనే రావలసియుంది. దాని రాక దైవికమైన శక్తిచేత స్వీయ ముద్రతో వెంటనే రావలసి ఉంది.

## ఆత్మతో వస్తుంది

ఆత్మ వచ్చినప్పుడు రాజ్యం వస్తుందని ప్రభువైన యేసు తన ఉపదేశములలో తెలిపాడు. ఆయన ఆరోహణానికి కొంచెం ముందుగా – "పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు ..." అని ఆయన తన అపొస్తలులకు తెలియజేశాడు (అపొ. 1:8). మరోవిధంగా చెప్పాలంటే, రాజ్యము యొక్క రాక పరిశుద్ధాత్మ అద్భుతరీతిగా అనుగ్రహింపబడడంతో జతచేయబడింది.

తనతో నిలిచియున్న వారిలో కొందరు మరణం రుచిచూడకముందే రాజ్యం బలముతో వస్తుందని ప్రభువు చెప్పిన మాట జ్ఞాపకం చేసికో (మార్కు 9:1). పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చునప్పుడు వారు శక్తి పొందుదురని ఆయన తన అపొస్తలులకు తెలియజేశాడు. పరిశుద్ధాత్మ అపొస్తలుల మీదికి రావడంలో పరిశుద్ధాత్మ బాప్తిస్మంగా వస్తుందన్న సంగతిని ఆయన సూచించాడు. తన అపొస్తలులతో ప్రభువైన యేసు గడిపిన

చివరి దినాలను గూర్చి లూకా యిలా దాఖలు చేశాడు.

> ఆయన వారిని కలిసికొని యీలాగు ఆజ్ఞాపించెను – మీరు యెరూషలేమునుండి వెళ్లక, నావలన వినిన తండ్రియొక్క వాగ్దానముకొరకు కనిపెట్టుడి; "యోహాను నీళ్లతో బాప్తిస్మము ఇచ్చెను గాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను."
>
> కాబట్టి వారు కూడివచ్చినప్పుడు – "ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" అని ఆయనను అడుగగా ఆయన "–కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు; వాటిని తెలిసికొనుట మీ పనికాదు. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను" (అపొ. 1:4–8).

ఇంకను వేరొక సందర్భంలో, ప్రభువు వారితో యిలా చెప్పినట్టు లూకా రికార్డు చేశాడు: "ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచి యుండుడని వారితో చెప్పెను" (లూకా 24:48, 49).

"తిరిగి చెప్పడమనేది నేర్చుకునే చట్టమైయున్నది" అని విద్యావేత్తలు అంటారు. "ఒక విషయంలోని వాస్తవాలను అంచనా వేయడం హెచ్చు తగ్గులులేని చట్టమైయుందని కూడా చెప్పవచ్చు." రాజ్యము యొక్క రాకను గూర్చి మనం చూచిన వాస్తవాలను శ్రద్ధగా తూచి చూడు: (1) ప్రభువైన యేసు యొక్క పరిచర్యలో తొలి భాగమందు రాజ్యము "సమీపమైయున్నది." (2) ప్రభువైన యేసు యొక్క పరిచర్యలో ఆయన మాటలు వింటున్నవారి జీవిత కాలంలోనే రాజ్యం వస్తుంది. (3) రాజ్యము బలంతో వస్తుంది. (4) పరిశుద్ధాత్మ అపొస్తలులమీదికి వచ్చునప్పుడు శక్తి వస్తుంది. (5) ప్రభువు కడసారిగా తన అపొస్తలులతో మాట్లాడినప్పుడు, కొద్ది దినములలోగా వారు పరిశుద్ధాత్మతో బాప్తిస్మం పొందుతారని తెలిపాడు. (6) పరిశుద్ధాత్మ యొక్క రాక కొరకు లేక శక్తి యొక్క రాకకొరకు అపొస్తలులు యెరూషలేములో నిలిచియుండవలసి ఉంది. రాజ్యము వచ్చినప్పుడు అది వారికి తెలుస్తుందని ఈ వాస్తవములన్నిటిని ఆయన తన శిష్యులకు తెలియజేశాడు. ఎందుకంటే ఈ ప్రత్యేకింపబడిన లక్షణాలనుబట్టి రాజ్యపు రాక సూచింపబడింది.

"కాలాంతము ఎప్పుడు వస్తుందో నాకెలా తెలుస్తుంది?" అన్న ప్రశ్నకు మనం యిచ్చే జవాబును పోలి యిది ఉంది. ప్రభువు తిరిగి ప్రత్యక్షమగునప్పుడు అంతం వస్తుందని క్రొత్త నిబంధన అంటున్నట్టు మనం చెప్పుతాం. క్రైస్తవ యుగాంతమందు ప్రభువు యొక్క ప్రత్యక్షత అగ్ని జ్వాలతో ఉంటుందని అది యింకను వివరిస్తుంది (2 థెస్స. 1:7–9; ప్రకటన 1:7), అది దూతగణంతో ఉంటుందని (మత్తయి 25:31), ప్రతి నేత్రము ఆయన రాకను చూస్తుందని క్రొత్త నిబంధన తెలుపుతోంది (ప్రకటన 1:7). ఆయన ఎప్పుడు వస్తాడో, అప్పుడది నీకు తప్పక తెలుస్తుంది. అంతం వచ్చినప్పుడు ఏమి జరుగుతుందో నీకు ఎవడును చెప్పనక్కరలేదు! అదే విధంగా, పరిశుద్ధాత్మయు శక్తియు రావడంతో రాజ్యము లేక సంఘము స్థాపింపబడుతుందని ప్రభువు తన శిష్యులతో

చెప్పాడు. అది వచ్చినప్పుడు, వారు దానిని సులభంగా గుర్తించినవారై, దానిని పూర్ణంగా ఎరిగినవారై ఉంటారు.

## ముగింపు

ప్రభువు ముందుగా సూచించినవి ఎప్పుడు నెరవేర్చబడ్డాయి? రాజ్యం ఎప్పుడు వచ్చింది?

క్రీస్తు ప్రభువు యొక్క పునరుత్థానం తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన ఈ ప్రవచనాలన్నియు నెరవేర్చబడలేదా? పెంతెకొస్తు అనే పండుగ దినం వచ్చినప్పుడు, అపొస్తలులపై పరిశుద్ధాత్మ కుమ్మరింపబడ్డాడు (అపో. 2:1–4). పరిశుద్ధాత్మ కుమ్మరింప బడడంతో అపొస్తలులు శక్తి పొందినవారై రోమా ప్రపంచమంతటిలో వారు క్రీస్తు ప్రభువుకు సాక్షులుగా నిలిచారు. ఆ సమయంలో కూడివచ్చిన జన సమూహంతో పేతురు ప్రధానంగా మాట్లాడి, పరిశుద్ధాత్మ వారి మీదికి కుమ్మరింపబడడం యోవేలు ప్రవచనం యొక్క నెరవేర్పైయున్నట్టు అతడు వారికి సూచించాడు (అపో. 2:16; యోవేలు 2:28–32). పరిశుద్ధాత్మ కుమ్మరింపబడడం “అంత్య దినములయొక్క ఆరంభమై”యున్నట్టు అతడు తెలిపాడు. మృతులలోనుండి లేపబడిన యేసు దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, క్రీస్తుగాను ప్రభువుగాను నియమింపబడినవాడై ఏలుతున్నట్టు కూడా పేతురు ప్రసంగించాడు. “కాగా ఆయన దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచునున్న దీనిని కుమ్మరించియున్నాడు” అని అతడు అన్నాడు (అపో. 2:33). పేతురు యొక్క ప్రసంగానికి ప్రత్యుత్తరంగా, విశ్వాసము, మారుమనస్సు, పాపక్షమాపణ కొరకు బాప్తిస్మం పొందడం ద్వారా మూడు వేలమంది లోబడినవారై, సంఘానికి చేర్చబడ్డారు (అపో. 2:41). ప్రభువైన యేసు పరలోకానికి ఆరోహణుడైన కేవలం పది దినాలకే పరిశుద్ధాత్మ వచ్చాడు (అపో. 1:3; 2:1) మరియు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందుదురని అపొస్తలులకు యిచ్చిన వాగ్దానం ఆయన ఆరోహణుడైన కొద్ది రోజులకు జరుగుననే దానితో సమన్వయంగా ఉంది (అపో. 1:5). కాలము సమీపమైయున్నదని రాజ్యమును గూర్చి యోహానును, ప్రభువైన యేసును ప్రకటించిన దానికి అనుగుణంగా పరిశుద్ధాత్మ రాకయు కాలక్రమానికి సరిపోయింది (మత్తయి 3:1; 4:17).

క్రీస్తు పునరుత్థానంతరం వచ్చిన తొలి పెంతెకొస్తు రాజ్యము వచ్చిన దినముగా నిరాక్షేపంగా నిలిచియుంది. మానవ చరిత్రలో ప్రభువు తన సంఘాన్ని ఈ సందర్భంలో స్థాపించాడు. క్రీస్తు యొక్క ప్రస్తుతపు ఏలుబడికి “సంఘము” మరియు “రాజ్యము” లనేవి రెండు దృక్పథాలలో సూచింపబడేవైనప్పటికిని, దేవునికిని క్రీస్తుకును ఒకే ప్రాథమిక బాంధవ్యాన్ని అవి సూచిస్తాయి.

క్రైస్తవ యుగంలో జీవించడం ఎంతటి భాగ్యమో! “రాజ్యము-వచ్చుగాక” అనే యుగం యిది కాదు. క్రీస్తు ప్రభువు యొక్క వ్యక్తిగత పరిచర్య కాలంలో ప్రజలును ప్రవక్తలును ఏదో ఒక దినాన రాజ్యం వస్తుందని కనిపెట్టారు. ఇది “రాజ్యం వచ్చిన

యుగం." రాజ్యం యిక్కడ ఉంది; అందులో మనం పౌరులమై ఉండవచ్చు. క్రీస్తు యొక్క మరణమును, రాజ్యం యొక్క స్థాపనయు ప్రసాదించు దైవికమైన ఆశీర్వాదములలో పాలివారమై ఉండవచ్చు.

మానవ విపత్తులలో అతి ఘోరమైన విపత్తు అవకాశాన్ని నిర్లక్ష్యపెట్టడమై ఉంటుంది. అది చాల గొప్ప తప్పు. ఎందుకంటే, ఏది సులభంగా జరిగియుండేదో, బాధ్యతారహితంగా ఉండినందున అది జరుగలేదు. రాజ్య యుగము అనే ఈ యుగంలో జీవించుతూ కూడా దేవుని రాజ్యంలో ప్రవేశించి పౌరుడుగా జీవించడాన్ని అశ్రద్ధ చేయడం తప్పక ఒక గొప్ప తప్పై తీరుతుంది.

నల్లటి గుండ్రని చిన్న రాళ్లతో దక్షిణ ఆఫ్రికాలో కొందరు బాలురు గోలీలాట ఆడుతున్నారు. పరిశోధనలో, వారు ఆడుకొంటున్న ఆ రాళ్లు పగులగొట్టబడని రత్నాలని తెలిపోయింది. దాన్ని గూర్చి ఆలోచించు! రత్నాలను గోలీలుగా వారు వాడుతున్నారు – గొప్ప భాగ్యంతో చిన్న పిల్లల ఆట వారాడుతున్నారు!

మనలను మనమే దగ్గరగా చూచుకొంటే, ఈ చిత్రంలో మనలను మనమే చూచుకోవచ్చు. గోలీలాటలో తీవ్రంగా మునిగియున్న బాలురవలె మనం అన్ని రకాలైన పనిపాటలలో ఒత్తిడిగానున్న బాధ్యతలలో మునిగియుండవచ్చు. మన ఎదుట దేవుని రాజ్యంలో ప్రవేశించే అవకాశం మనం పూర్తిగా మైమరచినట్టున్నాం. క్రీస్తు యొక్క బలిద్వారా దేవుడు పరలోకంనుండి పంపిన ప్రశస్తమైన రత్నాలు మన ముందున్నా వాటిని మరచాం. గోలీలాట మీద దృష్టియావత్తు నిలిపిన కారణాన యిలా మనం అలక్ష్యం చేశాం.

నీ సంగతి ఏమి? గోలీలాటతోనే జీవితంలో సంతృప్తిపడుతున్నావా? లేక దేవుని రాజ్యంలో ప్రవేశించడంచేత దేవుని ప్రశస్తమైన రత్నాలను తీసికొనడానికి ప్రయత్ని స్తున్నావా?

## పఠనము మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. సంఘమును గూర్చి ప్రభువు పలికిన కొన్ని రకాలైన ప్రవచనాలు ఏవి?
2. ప్రభువైన యేసు మన ప్రవక్తయా? నీ జవాబుకు రుజువు నిమ్ము.
3. "సమీపమైయున్నది" అనే ప్రయోగంలో సూచింపబడిన వాటిని చర్చించు.
4. రాజ్యము యొక్క రాకకు మార్కు 9:1 ఎలాటి సంబంధం కలిగియుంది.
5. రాజ్యము యొక్క రాకను గూర్చి మార్కు 9:1లో సూచింపబడినదేది?
6. రాజ్యము యొక్క రాక పరిశుద్ధాత్మ యొక్క రాకకు సంబంధమున్నట్టు సూచించే వచనము లేవి?
7. "బలముతో వచ్చుట," "ఆత్మతో వచ్చుట" అనేవి రెండును ఒక్కటేనని అంటావా?
8. హెచ్చు తగ్గులు లేని చట్టమేమి?
9. అపొ. 2లో పెంతెకొస్తు దినాన ప్రభువు యొక్క ప్రవచనాలు ఎలా నెరవేర్చ

బడ్డాయో చర్చించుము.

10. "సంఘము" మరియు "రాజ్యము" అనే రెండు పదాలు ఒకే దానిని సూచిస్తున్నాయా? నీ జవాబును వివరించుము.
11. ఇది "రాజ్యము వచ్చుగాక" అనే యుగమా?
12. నేడు ఒకడు రాజ్యములో ఎలా ప్రవేశిస్తాడు?